# ఎఱ్ఱసిరా

ఎఱ్ఱసిరా మరకని చూస్తే భయమేస్తుంది అశ్వత్థ నారాయణకి. ఈ భయాన్ని వాళ్ళ హెడ్డు గుమాస్తా టేబిలుమీద సీసా నేర్పింది. ఆ సీసాలోని సిరాను రోజంతా నంచుకొనే ఓ పొడవాటి కలం ప్రతీక్షణం సాదా గుమాస్తాల అదృష్టాన్ని కొలుస్తున్నట్టుండేది. ఇరవై అయిదేళ్ళ సర్వీసులో పండి ముదిరిన మహాగుమాస్తా అశ్వత్థ నారాయణని హఠాత్తుగా నిలిపి ప్రశ్నిస్తే–

"అశ్వత్థ నారాయణా! ప్రపంచంలోకల్లా ఇబ్బందిని కల్గించేది ఏది?"
అనబోయేసరికే జవాబు చెప్తాడు.

'ఎఱ్ఱసిరా, ఎఱ్ఱసిరా, ఎఱ్ఱసిరా.'

తన సర్వీసు రిజిస్టరులో చాలాసార్లు హెడ్డు గుమాస్తా ఎఱ్ఱసిరా గీతలు గీసినట్టు గుర్తు. ఎందుకు ఆఫీసుకు ఆలశ్యంగా వచ్చావు అని అడగడానికయినా హెడ్డు గుమాస్తా ఎఱ్ఱసిరాయే ఉపయోగిస్తాడు. ఏవైనా కాగితాలు తొందరగా పై వాళ్ళకి చేరాలంటే ఎఱ్ఱఫైళ్ళు. ఫైళ్ళు సరిగా సమయానికి టేబిళ్ళకు చేరకపోతే ఎఱ్ఱబడిన కళ్ళ ప్రశ్నలు, నిప్పులు.

అంతా ఎరుపు, ఎరుపు.

ఈ ఎరుపురంగు ఎందుకు పుట్టిందా అని పండి ముదిరిన మహా గుమాస్తా అశ్వత్థనారాయణ అనేకసార్లు ఆలోచనలో పడ్డాడు.

పొద్దుటే కళ్ళువిప్పాలంటే భయం – ఎఱ్ఱని ఆకాశం కనబడుతుందని. సాయంకాలం

చీకటి పడుతుందంటే భయం – ఆకాశం ఎర్రబడుతోందని. అందుకని చీకటి పడందీ ఎప్పుడూ ఆఫీసులోంచి బయటికిరాడు.

గుమాస్తాలు కాకముందే సాధారణంగా చాలామందికి పెళ్ళిళ్ళయి పోతాయి. పెళ్ళికూతుళ్లు సాధారణంగా గుమాస్తాల్ని పెళ్ళిళ్ళు చేసుకోరు. కాని పండిముదిరిన మహాగుమాస్తా అశ్వత్థ నారాయణ ఇరవై ఏళ్ళ క్రితం ఇంకా పండి ముదరకముందు పెళ్ళి చేసుకొన్నాడు. అప్పుడు మొదటిసారిగా పెళ్ళాన్నిచూశాక, ఆవిడ పెదాలు ఎర్రగా కనిపించి భయపడడం ప్రారంభించాడు. ఇరవై అయిదేళ్ళు ఆ భయాన్ని పెంచుకొన్నాక, పదిమంది పుట్టడం వల్ల ఆ పెదాలు తెల్లగా అయిపోయాక మెల్లగా స్థిమితపడడం నేర్చుకొన్నాడు.

అశ్వత్థ నారాయణని సైకాలజిస్టు చేతుల్లో పారేస్తే ఈ కారణాలను వరసగా చెప్పగల్డు.

అయిదేళ్ళ క్రిందట ఎర్రదీపం వెలుగుతూన్న రైలువంతెన దాటబోతూ పాలికేళ్ళ తమ్ముడు రైలుకిందపడి చచ్చిపోవడమూ –

అంతకంటె చిన్నప్పుడు వాళ్ళ నాన్న కొనిచ్చిన ఎర్రటి రబ్బరు బొమ్మలోంచి తేలు బయటికి వచ్చి కుట్టడమూ –

మరికొంచెం పెద్దయాక తనరొట్టె తింటున్నాడన్న కోపంతో ఎదురుగుండా ఇంట్లో ఉన్న ఎర్ర కుక్క కరవడం –

ఎర్రటి పెదవులున్న పెళ్ళాం పదిమంది పిల్లల్ని కనడం – ఎర్రసిరాతో రాసే హెడ్‌గుమాస్తా హయాంలో పడడం – ఎప్పుడూ ఎర్రఫైళ్ళే టేబిలు మీద మూల్గడం – ఎప్పుడు ఎర్రటి చెప్పులు కొనుక్కొన్నా కరుస్తూండడం – ఎర్రటి బస్సులు ఎక్కినప్పుడల్లా డబ్బులుపోవడం – ఎర్ర టిక్కెట్లు కొన్నప్పుడల్లా సర్‌చార్జీలు తగలడం – ఇల్లాంటివి.

ఇటువంటి 'ఎరుపుకాన్షస్' అయిన అశ్వత్థ నారాయణ' అర్ధరాత్రిలో డేంజర్ లైటులాగ ఆఫీసులో అందరి దృష్టిలోకీ వొచ్చేశాడు. వాళ్ళావిడ ఎర్రచీరె కట్టుకోదు. అతనెప్పుడూ తాంబూలం వేసుకోడు. సినిమా ఎప్పుడూ చూడడు. రంగురంగుల సినిమా అయితే అంతకన్నా చూడడు.

ఓరోజు అశ్వత్థ నారాయణ ఆఫీసుకి అరగంట ఆలశ్యంగా వచ్చిన గాబరాలో తనసీటు దగ్గరకి వెళ్తున్నాడు. కాళ్ళు వణుకుతున్నాయి. హెడ్ గుమాస్తా అప్పటికే ఫైళ్ళమీద ఏదో రాస్తున్నాడు. ఎర్రసిరా బుడ్డిలో సిరా అయిపోతోంది. టేబిలు మీద ఎర్రఫైళ్ళు అరలు అరలుగా కనిపిస్తున్నాయి. ఆరుగజాలలో ఉన్న టేబిలు అరమైలు దూరంలో ఉన్నట్టు కనిపిస్తోంది. హెడ్ గుమాస్తాను చూస్తూ ముందుకు నడిచాడు అశ్వత్థ నారాయణ. నుదుటిని చెమటపట్టింది. తుడుచుకోడానికి చెయ్యెత్తితే ఏదో చేతికి తగిలింది. హెడ్ గుమాస్తా టేబిలు కదిలింది.

టేబిలుమీద ఎర్రసిరాబుడ్డి కదిలింది – అవును – ఎర్రసిరాయే!

వాలికింది. వాలికి, టేబిలు మీద, కాగితాల మీదా, హెడ్డు వొంటి మీదా – ఎర్రసిరా, ఎర్రసిరా –

గుండె బద్దలయింది, కళ్ళముందు ఎర్రసిరా – ఎర్రటి కళ్ళు – ఎర్రటి ఫైళ్ళు – ఎర్రటి కాగితాలు – తెల్లటి షర్టు మీద ఎర్రటి మరకలు. కళ్ళముందు ఎరుపు మడుగు కట్టింది. అందరూ ఏవో మాట్లాడుతున్నారు.

"సార్, సార్, క్షమించండి సార్"

"వాట్ నాన్సెన్స్"

ఎర్రటి మాటలు!

"సార్, సార్ – చూడలేదు సార్"

"కళ్ళు కనిపించడం లేదా?"

ఎర్రటి బెదిరింపు!

"నిన్నేం చేస్తానో చూడు"

ఎర్రటి హెచ్చరికలు!

ఆ తర్వాత తన సర్వీసు ఫైల్లో ఎర్రటి అక్షరాలు! ఆ తర్వాత – మాటలు వినిపించడం లేదు.

మొహం తిరిగిందని ఇంట్లో పెళ్ళాం చెప్పింది.

"ఎర్రసిరా ఏమయింది? ఎర్రసిరా ఏమయింది?"

"కడిగేశారటండీ"

"ఎర్రసిరాపడ్డ ఫైళు?"

వెధవ ఫైళ్ళు.

ఆలోచిస్తూ వత్తిగిల్లాడు, హఠాత్తుగా చేతికి ఎర్రసిరా కనిపించింది.

అయ్యో – అయ్యో వేలికి ఎరుపయింది. చూసుకోలేదు. ఇప్పుడు కనిపించింది. మధ్యవేలికి ఎర్రసిరా – ఎర్రటి మరక – కెవ్వున కేకవేసి పెళ్ళాన్ని పిలిచాడు, వేలు కడగాలి.

"ఎందుకూ?"

"చూడు, చూడు."

"అయ్యో – ఎలాగయింది!"

"హెడ్డు గుమాస్తాది"

పెళ్ళాం గంటసేపు కడిగింది – అయినా ఇంకా ఎరుపు మిగిలింది.

– చేసుకున్న పాపంలాగ.

–వదలని జ్ఞాపకం లాగ.

ఆ రాత్రి. మర్నాడు గడిచాక అశ్వత్థ నారాయణకి జ్వరమొచ్చిందని డాక్టర్లు అన్నారు.

ఆఫీసువాళ్ళు వచ్చి చూస్తే "హెడ్డు ఏమంటున్నాడు?" అనడిగాడు.

"ఏం లేదులే – వెధవ సీసా – మరొకటి పెట్టారు"

"అయితే సీసా పగిలిపోయిందన్న మాట!"

"అవును . కలమూ పాడయిందట"

"అయ్యో అయ్యో!"

"ఫర్వాలేదులే"

"సీరియస్ ఆక్సిడెంట్!"

ఆఫీసువాళ్ళు వెళ్ళిపోయేరు.

సీరియస్ ఆక్సిడెంట్‌ను గురించిన ఎర్రటి ఆలోచనలు అశ్వత్థనారాయణకి వచ్చాయి.

హెడ్డు టేబిలు మీద కొత్త సిరాబుడ్డి, కొత్త కలం ఉంటాయి.

వాటికి దగ్గరగా వెళ్ళకూడదు. ఈపాటికి తన సర్వీసు ఫైలులో ఎర్రసిరా విషయం రాసేసి ఉంటాడు – ఎర్రటి అక్షరాలతో.

హెడ్ గుమాస్తా ఎర్రటి కళ్ళు గుర్తు తెచ్చుకొంటూ పడుకొన్నాడు.

మర్నాడు ఎవరో చెప్తే పాపం పోనీలే చూసిపోదామని అశ్వత్థ నారాయణ ఇంటికి హెడ్డు గుమాస్తా వచ్చాడు.

కాని కళ్ళిప్పితే ఆకాశం ఎరుపు కనిపిస్తుందేమోనని కళ్ళిప్పడం లేదని వాళ్ళావిడ చెప్పింది.

కాని ఆవిడకి చెప్పడం తెలీలేదు.

కళ్ళిప్పితే హెడ్డు గుమాస్తా కొత్త ఎర్రసిరాబుడ్డి కనిపిస్తుందని కళ్ళు తెరవలేదు అశ్వత్థనారాయణ.

ఆ తర్వాత మరెప్పుడూ తెరవనే లేదు!

----